క్లుప్తంగా

18న మండల సర్వసభ్య సమావేశం

ప్యాపిలి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 18వ తేదీ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సాయిమనోహర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 10:30 గంటలకు ఎంపీపీ గోకుల్‌లక్ష్మీ అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశానికి స్థానిక ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు తప్పక హాజరు కావాలన్నారు. గత మూడు నెలల్లో చేపట్టిన కార్యక్రమాలకు సంబంధించిన ప్రగతి నివేదికలను ఆయా శాఖల అధికారులు సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు.

ట్రిపుల్ ఐటీకి ఎంపిక


గౌతమి

నందిని

విష్ణువర్ధన్

బనగానపల్లె రూరల్: మండలంలోని ఇల్లూరుకొత్తపేట జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు స్కూల్ హెచ్‌ఎం సోమశేఖర్‌రెడ్డి సోమవారం తెలిపారు. తమ పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థినులు గౌతమి,నందిని ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీకి, విష్ణువర్ధన్ నూజివీడు ట్రిపుల్ ఐటీకి ఎంపిక కావడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. విద్యార్థులను హెచ్‌ఎంతో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

గుండెపోటుతో యువకుడి మృతి


తలారి మధు శేఖర్ (ఫైల్)

బేతంచెర్ల: పట్టణంలోని హనుమాన్ నగర్ కాలనీకి చెందిన తలారి మధు శేఖర్ (26)కు సోమవారం గుండెపోటు రావడంతో శేషారెడ్డి సీహెచ్‌సీ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడు ఓ ఫ్యాక్టరీలో గుమస్తాగా పనిచేస్తున్నాడు. కుటుంబానికి అండగా ఉన్న మధు శేఖర్ మృతితో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. మృతునికి భార్య, ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు.

21న బాబా ఆలయంలో విశేష పూజలు

బనగానపల్లె: గురుపూర్ణిమ సందర్భంగా ఈ నెల 21, 22వ తేదీల్లో యాగంటి రహదారిలోని షిరిడీ సాయిబాబా మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు సాయిగురువు శ్రీనివాసులు తెలిపారు. ఇందులో భాగంగా 21న ఉదయం సాయిబాబాకు కాగడ హారతి, అభిషేకం, ఉచిత సామూహిక సాయి సత్యవ్రతాలు, మధ్యాహ్నం హారతి, ఊరేగింపు, 22వ తేదీ ఉదయం కాగడ హారతి, మంగళహారతి తదితర కార్యక్రమాలతో ముగుస్తాయన్నారు.

గోర్లగుట్టలో వేధింపుల కేసు నమోదు

బేతంచెర్ల: మండలంలోని గోర్లగుట్ట గ్రామానికి చెందిన దూదేకుల ఆశాబి అనే మహిళను భర్త సిద్ధయ్యతో పాటు బావ ఇమామ్ కాశీమ్, మరో ముగ్గురు శారీరకంగా, మానసికంగా వేధింపులకు గురి చేస్తున్నారని బాధితురాలు సోమవారం పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించింది. ఆమె ఫిర్యాదు మేరకు ఐదుగురిపై వేధింపుల కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ చంద్రశేఖర్ తెలిపారు.

నీటి సరఫరాలో అంతరాయం

డోన్ టౌన్: పట్టణానికి తాగునీరు అందించే గాజులదిన్నె ప్రాజెక్టు వద్ద మోటర్లు మరమ్మతులకు గురి కావడంతో మంచినీటి సరఫరాలో అంతరాయం ఉంటుందని మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరామ్ సోమవారం తెలిపారు. మంగళ, బుధవారాల్లో పట్టణంలో నీటి సరఫరాలో అంతరాయం ఉంటుందని.. మరమ్మతులు చేసి గురువారం నుంచి యథావిధిగా నీటి సరఫరా చేస్తామని చెప్పారు. ప్రజలు సహకరించాలని కోరారు.

విద్యార్థినికి ఆర్థిక సాయం

ప్యాపిలి: మండల పరిధిలోని పీఆర్ పల్లి గ్రామానికి చెందిన బంటుపల్లి అమృతకు డోన్ మండలం మల్యాల గ్రామానికి చెందిన సురేశ్ రూ. 5 వేలు ఆర్థికసాయం అందజేశారు. ఈ ఏడాది జరిగిన పదోతరగతి పరీక్షల్లో అమృత 567 మార్కులతో టాపర్‌గా నిలిచి ట్రిపుల్ ఐటీలో సీటు సాధించింది. విషయం తెలుసుకున్న సురేశ్ ఆర్థికసాయం అందజేశారు.

అంతా భ్రాంతియేనా?

- నెల దాటినా నిరుద్యోగ భృతి ఊసెత్తని కూటమి ప్రభుత్వం
- ఉద్యోగం వచ్చే వరకు నెలకు రూ. 3వేలు ఇస్తామని హామీ
- ఆశగా ఎదురుచూస్తున్న నిరుద్యోగులు
- గతంలో మాట తప్పిన బాబు సర్కార్
- కోవెలకుంట్ల నియోజకవర్గంలో 72 వేల మంది

అది 2014 ఎన్నికల సమయం. జాబు కావాలంటే బాబు రావాలి అంటూ టీడీపీ నాయకులు ఊదరగొట్టారు. జాబ్ వచ్చే వరకు ప్రతి నిరుద్యోగికి రూ. 2 వేలు నిరుద్యోగ భృతి ఇస్తామని హామీలు గుప్పించారు. అధికారంలోకి రాగానే హామీని తుంగలో తొక్కారు. సరిగ్గా 2019 ఎన్నికల సమయానికి మూడు నెలల ముందు కొందరికి మాత్రమే రూ. 2 వేలు చొప్పున నిరుద్యోగ భృతి ఇచ్చి చేతులు దులుపుకున్నారు. దీంతో ఆ ఎన్నికల్లో నిరుద్యోగులు, యువత బాబుకు బుద్ధి చెప్పి వైఎస్సార్‌సీపీకి పట్టం కట్టారు. తిరిగి 2024 ఎన్నికలకు ముందు నిరుద్యోగులకు ఉద్యోగాలు, ఉద్యోగం వచ్చే వరకు నెలకు రూ. 3 వేలు నిరుద్యోగ భృతి హామీ గుప్పించి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి నెల దాటినా ఇప్పటి వరకు నిరుద్యోగ భృతిపై బాబు సర్కార్ నోరు మెదపకపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మళ్లీ అదే సీన్ రిపీట్ అవుతుందా అంటూ నిరుద్యోగులు పెదవి విరుస్తున్నారు.



కోవెలకుంట్ల/బనగానపల్లె/డోన్: ఇంటికో ఉద్యోగం, అంతవరకు రూ.3 వేల నిరుద్యోగ భృతి ఇదీ చంద్రబాబు 2014 మేనిఫెస్టో. యువతను మభ్యపెట్టి గద్దెనెక్కారు. నాలున్నర ఏళ్లు కాలయాపన చేశారు. 2019 ఎన్నికలకు మూడు నెలల ముందు అరకొరగా భృతి ఇచ్చేసి చేతులు దులుపుకున్నారు. ఇటీవల ఎన్నికల్లోనూ ఇదే మంత్రం పాటించారు. ప్రతి నిరుద్యోగికి రూ.3 వేలు ఇస్తామని హామీ గుప్పించారు. అధికారంలోకి వచ్చి నెల రోజులు పూర్తయినా నిరుద్యోగ భృతిపై నోరు మెదపడం లేదు. బనగానపల్లె నియోజకవర్గంలోని కోవెలకుంట్ల మండలంలో 12,350 కుటుంబాలు, బనగానపల్లె మండలంలో 22వేలు, కొలిమిగుండ్ల మండలంలో 14,205 వేలు, అవుకు మండలంలో 14వేలు, సంజామల మండలంలో 10 వేల నిరుద్యోగ కుటుంబాలు ఉన్నాయి. ఆ కుటుంబాలు ఉద్యోగాలు, ఉపాధి కోసం ఎదురు చూస్తున్నాయి. జాబ్ క్యాలెండర్‌పై గంపెడు ఆశలు పెట్టుకున్నాయి. ప్రమాణ స్వీకారం చేసిన తొలి రోజే మెగా డీఎస్సీ ఫైల్‌పై తొలి సంతకం చేసిన బాబు డీఎస్సీ పేరుతో నిరుద్యోగుల ఆశలపై నీళ్లు చల్లారు. కేవలం 16వేలు పోస్టులు భర్తీ చేసేందుకు చర్యలు చేపట్టి టెట్ నిర్వహణ పేరుతో ఈ ఏడాది డిసెంబర్ వరకు ఆ ఊసే లేకుండా చేశారు. త్వరితగతిన డీఎస్సీ ఉంటుందని భావించిన డీఎడ్, బీఎడ్ పూర్తి చేసిన నిరుద్యోగులు వేలాది రూపాయాలు అప్పులు చేసి కర్నూలు, నంద్యాల, హైదరాబాద్, విజయవాడ, తదితర ప్రాంతాలకు కోచింగ్ సెంటర్లకు వెళ్లారు. తీరా డీఎస్సీ నిర్వహణపై ఎలాంటి స్పష్టత లేకపోవడంతో మల్లాగుల్లాలు పడుతున్నారు. డీఎస్సీతోపాటు ఇతర ఉద్యోగాల భర్తీకి సంబంధించి ఇప్పటి వరకు ప్రస్తావన లేదు. ఉద్యోగాల భర్తీ ప్రక్రియ అటుంచితే నిరుద్యోగ భృతిపై ప్రభుత్వం నోరు మెదపకపోవడంతో నిరుద్యోగులు ఆందోళన చెందుతున్నారు. నియోజకవర్గంలోని నిరుద్యోగులు డీఎస్సీ కోచింగ్‌కు వివిధ ప్రాంతాలకు వెళ్లగా ఆర్థిక స్తోమత లేని నిరుద్యోగులు ప్రైవేట్ పాఠశాలల్లో ఉపాధ్యాయులుగా, వివిధ వ్యాపార సంస్థలు, నాపరాతి పరిశ్రమలు, ఉపాధి, వ్యవసాయ పనులకు వెళుతూ కాలం వెళ్లదీస్తున్నారు. చంద్రబాబు ప్రభుత్వం జాబ్ క్యాలెండర్‌ను అమలు చేయడంతోపాటు ఉద్యోగం వచ్చే వరకు నెలకు రూ. 3వేలు నిరుద్యోగ భృతి ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

నియోజకవర్గంలో నిరుద్యోగులు

బనగానపల్లె	-22,000
కొలిమిగుండ్ల	-14,205
అవుకు	-14,000
కోవెలకుంట్ల	-12,350
సంజామల	- 10934

అందని ద్రాక్షపండేనా

నంద్యాల జిల్లా డోన్ నియోజకవర్గంలో 81,861 మంది నిరుద్యోగులు ఉపాధి అవకాశాలు, ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నారు. 10 నుంచి డిగ్రీ ఆపైన పాసైన వారంతా టీడీపీ మేనిఫెస్టోలో చెప్పిన విధంగా తమకు ప్రతి నెలా నిరుద్యోగ భృతి కింద రూ.3 వేలు ఇస్తుందని ఆశిస్తున్నారు.

భృతి కోసం ఎదురు చూస్తున్నా



నేను డిగ్రీ పూర్తి చేసి ఉద్యోగం కోసం ఎదురు చూస్తున్నాను. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఇంటికో ఉద్యోగం లేదా నిరుద్యోగ భృతి కింద రూ.3 వేలు ఇస్తామని నాయకులు హామీ ఇచ్చారు. ప్రభుత్వం ఏర్పాటై సుమారు 40 రోజులు అవుతున్నా నిద్యోగుల విషయంపై ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రకటన రాలేదు. ఆశగా ఎదురుచూస్తున్నా. 2014–19 టీడీపీ ప్రభుత్వంలో కూడా ఇలానే కాలయాపన చేసి ఎన్నికల దగ్గరలో రెండు సార్లు నగదు జమచేసి చేతులెత్తేశారు. అలాంటి పరిస్థితి పునరావృతం కాకుండా వెంటనే అమలుకు చర్యలు తీసుకోవాలి.

–మల్లికార్జున, అవుకు

గంపెడాశతో ఉన్నాం



నేను బి.టెక్ మెకానికల్ 2022లో పూర్తిచేశాను. నాటి నుంచి సరైన ఉపాధి అవకాశాలు లభించక తీవ్ర నైరాశ్యంలో మునిగిపోయాను. చెప్పలేని మానసిక క్షోభను అనుభవిస్తున్నా. టీడీపీ ప్రభుత్వం ఉపాధి అవకాశాలకు పెద్దపీట వేస్తామని, ఒకవేళ ఉపాధి చూపించలేకపోతే ప్రతి నిరుద్యోగికి భృతి అందజేస్తామని ఎన్నికల సందర్భంగా ఆశ చూపించింది. గతంలో మాదిరిగా నిరుద్యోగ యువతను నట్టేట ముంచకుండా ప్రతి నెలా నిరుద్యోగ భృతి కింద రూ.3 వేలు అందజేస్తుందని గంపెడాశతో ఉన్నాం.

–షేక్ అశోక్‌కుమార్, బి.టెక్, మెకానికల్, దత్తనగర్, డోన్

మాట నిలబెట్టుకోవాలి



ప్రభుత్వ ఉద్యోగాల ప్రకటన లేకపోవడంతో చాలా మంది నిరుద్యోగులు ఆర్థికంగా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తాము అధికారంలోకి వస్తే ఇంటికో ఉద్యోగం లేదా నిరుద్యోగ భృతి అందజేస్తామని కూటమి ప్రభుత్వం హామీ ఇవ్వడంతో యువత ఆ పార్టీకి మద్దతుగా నిలిచారు. అయితే అధికారంలోకి వచ్చి నెల దాటినా ఎలాంటి ప్రకటన లేకపోవడంతో నిరుద్యోగులు ఆందోళన చెందుతున్నారు. 2014 సమయంలో కూడా భృతి ఇస్తామని నిండా ముంచారు. ఇప్పుడైనా చిత్తశుద్ధితో హామీని నిలబెట్టుకోవాలి.

–ఉదయ్ కుమార్, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు, బేతంచెర్ల

ఉద్యోగాల ప్రకటన చేయాలి



నేను బీకాం బీఈడీ చదివాను. చాలా కాలంగా డీఎస్సీ నోటిఫికేషన్ కోసం ఎదురుచేస్తున్నాను. ఇతర శాఖల్లోనూ ఉద్యోగాలు భర్తీ చేయకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాను. ఎన్నికల సమయంలో నిరుద్యోగులకు చంద్రబాబు ఇచ్చిన హామీతో ఊరట చెందాను. అయితే అధికారంలోకి వచ్చి నెల దాటినా నిరుద్యోగ భృతిపై ప్రకటన చేయకపోవడంతో ఆందోళనగా ఉంది. ఇచ్చిన మాట నెలబెట్టుకుని యువతకు న్యాయం చేయాలి.

–చిన్నరాయుడు, క్రైప, బనగానపల్లె

పెట్రోల్ బంకులో పనిచేస్తున్నా



2008లో బీఏ బీఈడీ పూర్తి చేశాను. గతంలో తక్కువ పోస్టులతో ఒకటి, రెండు డీఎస్సీ నోటిఫికేషన్లు మాత్రమే వచ్చాయి. ప్రభుత్వ ఉద్యోగం రాకపోవడంతో పట్టణంలోని ఓ పెట్రోల్ బంకులో పనిచేస్తున్నాను. కొంత పొలాన్ని కౌలుకు తీసుకుని వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాను. తెలుగుదేశం ప్రభుత్వం డీఎస్సీ నిర్వహణకు తొలి సంతకం చేసినా మరింత ఆలస్యం అయ్యేలా కనిపిస్తోంది. డీఎస్సీ నిర్వహణకు ప్రస్తుతం ఉన్న వయస్సును మరో ఐదు ఏళ్లు పెంచి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు సడలింపు ఇవ్వాలి.

–సుబ్బరాయుడు, నిరుద్యోగి, కోవెలకుంట్ల

నిరుద్యోగ భృతి ఇచ్చి ఆదుకోవాలి



ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం డీఎస్సీ నిర్వహణకు తొలి సంతకం చేసింది. ఎలాంటి జాప్యం లేకుండా వెంటనే డీఎస్సీ నిర్వహించాలి. డీఎస్సీతోపాటు జాబ్ క్యాలెండర్ ప్రకటించి వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలి. ఉద్యోగం వచ్చే వరకు ప్రతి నిరుద్యోగికి నెలకు రూ. 3వేలు నిరుద్యోగ భృతి ఇవ్వాలి. జిల్లాలో వేలాది మంది నిరుద్యోగులు ఉద్యోగాలు లేక వ్యవసాయ, ఉపాధి పనులకు వెళుతున్నారు. ప్రభుత్వం నిరుద్యోగులను అన్ని విధాలా ఆదుకోవాలి.

–దేవరాజు, నిరుద్యోగ జేఏసీ నాయకుడు, కోవెలకుంట్ల

మూడేళ్ల నుంచి కోచింగ్ తీసుకుంటున్నా



నేను డిగ్రీ, యూజీడీపీడీ పూర్తి చేశారు. మూడు సంవత్సరాల నుంచి పీఈటీ డీఎస్సీ కోచింగ్ తీసుకుంటున్నాను. దీని వల్ల మా కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటోంది. కూటమి ప్రభుత్వం ఇంటికో ఉద్యోగం, నిరుద్యోగ భృతి ఇస్తానని హామీ ఇచ్చింది. ప్రభుత్వం ఏర్పడి నెల దాటినా నిరుద్యోగ భృతిపై ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంతో ఆందోళనగా ఉంది. డిగ్రీ చదివి కూడా వ్యవసాయ కూలీగా మారాల్సిన పరిస్థితి ఏర్పడింది.

–ఆకుల మహబూబ్ బాషా, గిద్దలూరు, సంజామల

ఉల్లాసంగా.. ఉత్సాహంగా



కొండపేటలో కొలువైన కాశీంవలిస్వామి, సొదరదిన్నెలో బాదుల్లాస్వామికి ఫతేహాలు సమర్పిస్తున్న భక్తులు


ఆస్థానంలో కొలువైన హజరత్ అబ్బాస్ పీర్లకు ఫతేహాలు సమర్పిస్తున్న భక్తులు

- ఘనంగా మొహర్రం వేడుకలు
- వివిధ వేషధారణలతో మొక్కులు చెల్లించిన భక్తులు


నోటికి శూలం గుచ్చుకున్న పక్కీరు


అమ్మవారి వేషధారణలో యువకుడు


విద్యుత్ దీపాలంకరణలో ఆస్థానం

డోన్: మొహర్రం వేడుకలు డోన్ పట్టణంలో కనుల పండువగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా తమ ఇష్టదైవాలైన పీర్లకు వివిధ రకాల వేషాలు వేసి మొక్కులు తీర్చుకుంటున్నారు. మరికొందరు సరదాగా వేషాలు కట్టి గ్రామీణ ప్రాంతాల్లో జోష్ నింపుతున్నారు. పలువురు యువకులతో పాటు పెద్దలు ఆడ వేషాలు, సుబ్బిశెట్టి వేషాలు వేసి అలరిస్తుండగా, పక్కీర్లు నోటికి బాణాలు గుచ్చుకుని భక్తిభావం చాటుతున్నారు. సంప్రదాయబద్ధంగా అన్ని పీర్లచావిళ్ల ఎదురుగా అగ్నిగుండ ప్రవేశాలు చేసి మొక్కులు చెల్లించుకుంటున్నారు.

భక్తిశ్రద్ధలతో మధ్య సరిగెత్తు వేడుకలు

కోవెలకుంట్ల: మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం మధ్య సరిగెత్తు వేడుకలను ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని చిన్నబార్‌ఇమాం, పెద్దబార్‌ఇమాం, ఆంజనేయస్వామి దేవాలయం, రంగరాజుపేట, బాబానగర్, జెండామాను వీధి, సంతపేట, బసిరెడ్డిబావి వీధుల్లో బీబీఫాతిమా, ఇమాంకాశీం, హజరత్ అలీ అక్బర్, చిన్నబార్ ఇమాం, ఇమాంకాశీం, పెద్దబార్‌ఇమాం, హజరత్ అబ్బాస్, హజరత్ అలీ అబ్బాస్, దస్తగిరిస్వామి, మస్తాన్‌వలి, ఉద్దండ ఇమాంకాశీం పీర్లను కొలువుంచారు. మండలంలోని గుళ్లదూర్తి, సొదరదిన్నె, కలుగొట్ల, అమడాల, తదితర గ్రామాల్లో దస్తగిరి స్వామి, మౌలాలిస్వామి, బాదుల్లాస్వామి పీర్లను కొలువుంచి భక్తులు ప్రత్యేక ఫతేహాలు సమర్పించారు. సాయంత్రం ఆయా గ్రామాల్లో మధ్య సరిగెత్తును పురస్కరించుకుని పీర్ల ఊరేగింపు సాగింది. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం పెద్దసరిగెత్తు వేడుకలు జరుగనున్నాయి.

ఘనంగా మధ్య సరిగెత్తు

బనగానపల్లెరూరల్: మొహర్రం ఉత్సవాల్లో భాగంగా బనగానపల్లె పట్టణంలో మధ్యసరిగెత్తు కార్యక్రమం సోమవారం భక్తిశ్రద్ధలతో జరిగింది. నవాబుకోట, కొండపేటలోని తల్లి పీర్లు, పోలీసు సర్కిల్ కార్యాలయం పక్కలో కొలువైన ఇమాంఖాసీం, ఆస్థానంలో హజరత్‌అబ్బాస్ పీర్లను హిందూ, ముస్లింలు అధిక సంఖ్యలో దర్శించుకుని పూలదట్టి సమర్పించి మొక్కులు చెల్లించారు. ఆస్థానంలో బనగానపల్లె నవాబు వంశీయులు నవాబు మీర్ ఫజల్ అలీఖాన్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. పట్టణంలోని ఆస్థానం నుంచి షియా మతస్తుల మాతం కార్యక్రమం నవాబుకోట వరకు జరిగింది. బనగానపల్లె సీఐ గంటాసుబ్బారావు ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

వేడుకగా ఉమామహేశ్వరుని పల్లకీ సేవ


శివపార్వతులకు పల్లకీ సేవ నిర్వహిస్తున్న ఆలయ సిబ్బంది

బనగానపల్లెరూరల్: యాగంటి క్షేత్రంలో వెలసిన ఉమా మహేశ్వరస్వామి వారికి సోమవారం పల్లకీ సేవను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి, ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో ఉదయం శివపార్వతులకు అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక అలంకరణలు చేశారు. సాయంత్రం స్వామి వార్ల ఉత్సవ విగ్రహాలను సుందరంగా అలంకరించిన పల్లకిలో కొలువుదీర్చి ఆలయ ప్రాకారంలో ఊరేగించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాతపాడు సర్పంచ్ బెడదల మహేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీహెచ్‌సీలో అన్నదానం

బేతంచెర్ల: పట్టణంలోని శేషారెడ్డి సీహెచ్‌సీలో రోగులు, వారి సహాయకులకు లయన్స్ క్లబ్ సభ్యులు సోమవారం అన్నదానం చేశారు. క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు మధుసూదన్ రెడ్డి, రాజు పాల్గొన్నారు.

పశువులకు చికిత్స

బేతంచెర్ల: ఆర్ఎస్ రంగాపురంలోని పశువైద్యశాలలో రాష్ట్రీయ గోకుల్ మిషన్ ద్వారా సోమవారం పశువులకు ఉచిత గర్భకోశ చికిత్సలు చేశారు. కర్నూలు పశుగణాభివృ సంస్థ ఈఓ డాక్టర్ రాజశేఖర్, నంద్యాల డిప్యూటీ డైరెక్టర్ పార్థసారధి, డోన్ అసిస్టెంట్ డైరెక్టర్ నాగరాజు 45 పశువులకు చికిత్సలు చేశారు.

విద్యుత్ ప్రమాదంలో గేదె మృతి

కోవెలకుంట్ల: విద్యుత్ ప్రమాదంలో పాడి గేదె మృతి చెందిన ఘటన మండలంలోని కలుగొట్ల గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన మస్తాన్‌వలి గేదెలను మేతకు తీలుకెళ్లి తిరిగి వస్తుండగా పొలంలో కిందకు వేలాడుతున్న విద్యుత్ తీగలు తగిలి గేదె మృత్యువాత పడింది. అధికారులు తనకు న్యాయం చేయాలని బాధితుడు కోరుతున్నాడు.

అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్ అమలు చేయాలి

డోన్ టౌన్: న్యాయవాదులపై దాడులు చేసే వారి నుంచి రక్షణ కోసం అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్‌ను రాష్ట్రంలో అమలు చేయాలని డోన్ బార్ కౌన్సిల్ అసోసియేషన్ మాజీ కోశాధికారి పులిదామోధర్ కోరారు. సోమవారం నంద్యాలలో న్యాయశాఖ మంత్రి ఫరూక్‌ను కలిసి న్యాయవాదుల సంతకాలతో కూడిన వినతి పత్రం అందజేశారు. రాజస్థాన్, ఢిల్లీ, కర్ణాటక రాష్ట్రాల్లో యాక్ట్ అమలు చేస్తున్నారన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

బేతంచెర్ల: అంగన్‌వాడీ కేంద్రాల్లోని సమస్యలను పరిష్కరించాలని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు శేబారాణి కోరారు. సోమవారం అంగన్‌వాడీలతో కలిసి తహసీల్దార్ జీవన్ చంద్ర శేఖర్‌కు వినతి పత్రం అందజేశారు. నాగలక్ష్మి, గుల్జార్‌బీ, రామ తులసి, లక్ష్మీదేవి, జ్యోతి పాల్గొన్నారు.

ఘనంగా స్వాతినక్షత్ర పూజలు



బేతంచెర్ల: మద్దిలేటి స్వామి ఆలయలంలో స్వామివారి జన్మనక్షత్రమైన స్వామి నక్షత్రాన్ని పురస్కరించుకుని సోమవారం విశేష పూజలు నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేత మద్దిలేటి నరసింహస్వామికి సుప్రభాత సేవ, ప్రత్యేక పూజలు, విశ్వక్సేనారాధన, వాసు దేవ పుణ్యాహవచనం, సుదర్శన హోమం, నవకలశ స్నపనం, నరసింహ హోమం, తిరుమంజనం, ధన్వంతరి మూలమంత్ర తదితర పూజలు చేశారు. అనంతరం స్వామివారిని మాడవీధుల్లో ఊరేగించారు. ఈఓ రామాంజనేయులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

21న గురుపౌర్ణమి వేడుకలు

కొలిమిగుండ్ల: గురు పౌర్ణమి వేడుకలను పురస్కరించుకుని ఈనెల 21న కొలిమిగుండ్లలోని సాయిబాబా ఆలయంలో షిర్డీ సాయి సేవా ట్ర స్ట్ ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వ హించనున్నట్లు ట్రస్ట్ స భ్యులు తెలిపారు. ఉదయం హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ గాయకుడు రవీంద్రబాబు అర వా, శ్రీనోరి రఘురామమూర్తి దంపతుల బృందంతో భక్తి గీతాంజలి కా ర్యక్రమం ఉంటుందన్నారు. కర్నూలు జిల్లా లక్కసాగరానికి చెందిన గా యనీ దాసరి పార్వతి గీ తాలు పాడుతారన్నారు. 15ఏళ్ల లోపు చిన్నారులతో భక్తి గీతాలు పోటీలు నిర్వహించి ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందజేస్తామని తెలిపారు.